క్లుప్తంగా

విద్యా సామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందజేస్తున్న సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

నరసన్నపేట: మండలంలోని గొట్టిపల్లి ప్రాథమిక స్కూల్‌కు చెందిన 35 మంది విద్యార్థులకు స్థానిక సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు గురువారం వితరణ చేశారు. వీటిని ఫోరం ప్రతినిధులు పుచ్చల విశ్వేశ్వరరావు, పూర్ణారావు, సువ్వారి మురళీధర్ తదితరులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించి, వారికి అవసరమైన మందులు ఉచితంగా ఇస్తామన్నారు. ఫోరం ప్రతినిధి మార్పు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 80 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా స్థానిక చిత్తిరివీధి సాయి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరంలో 80 మందికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ వారి సహకారంతో గురువారం ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. దీంట్లో 210 మందికి తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం 45 మందికి ఆపరేషన్లకు తరలించామని, మిగిలిన వారిని రెండో విడతలో మూడు రోజుల వ్యవధిలో తీసుకువెళ్తామని సాయి మందిరం ప్రతినిధి నాగేశ్వరరావు, కె.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు. పోలాకి ఆప్తాలమిక్ ఆఫీసర్ బాలగంగాధరరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టాలి



చెత్త సేకరణ బుట్టలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, తదితరులు

నరసన్నపేట: మండలంలో ఇంటింటి వద్ద చెత్త సేకరణ బాధ్యతగా నిర్వహించాలని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మండలానికి మంజూరైన 35 వేల చెత్త సేకరణ బుట్టలను పంచాయతీల వారిగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ రెండు రకాల చెత్త సేకరణ బుట్టలు ఇవ్వాలని, వాటిల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని కోరారు. ఈ బుట్టల పంపిణీ సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, ఎంపీడీఓ బి.మధుసూదనరావు, గొట్టిపల్లి సర్పంచ్ అవ్వ రవి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం విత్తనాల పంపిణీ



పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: పశుగ్రాసాన్ని పాడి రైతులు అధికంగా పెంచాలని పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు సి.హెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. పశుగ్రాస వారోత్సవాలు సందర్భంగా విజయరాంపురం గ్రామంలో పశుగ్రాసం విత్తనాలు గురువారం పంపిణీ చేశారు. పశుగ్రాసం పెంపు వల్ల కలిగే ప్రయోజనాల గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. స్థానిక సర్పంచ్ బెండి అప్పలనాయుడు, మండల పశువైద్యాధికారి డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



స్వామివారిని తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో ఆషాఢ మాసం బహుళ ఏకాదశి సందర్భంగా గురువారం రాత్రి స్వామివారికి తిరువీధి నిర్వహించారు. పార్వతీపరమేశ్వరులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ ▸ పేదలకు వరం

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లపై జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల మంజూరులో కీలక పాత్ర పోషిస్తున్న వారిపై నిందలు తగవంటూ అన్ని వర్గాల వారు మండిపడుతున్నారు. కరోనా వంటి కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన వైనాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

వలంటీర్ సేవలు వెలకట్టలేనివి



గతంలో దివ్యాంగ ఫించన్ పొందాలంటే మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పడిగాపులు కాస్తే అందేది. ఈ ప్రభుత్వం వచ్చి వలంటీర్ వ్యవస్థ తీసుకురాడంతో నాలాంటి వారికి ఎంతో మేలు జరిగింది. మా వలంటీర్ ఎ.మీనాకుమారి ప్రతీ నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ అందజేస్తుంది. మా కుటుంబానికి ఎటువంటి ప్రభుత్వం పథకానికి అర్హత ఉన్నా అన్నీ దగ్గరుండి చూసుకుంటుంది. కరోనా సమయంలో ఇంటికి వచ్చి మందులు అందించి, కరోనా జాగ్రత్తల గురించి అవగాహన కల్పించింది.

– గురుగుబెల్లి ధనుంజయరావు, తమ్మయ్యపేట, ఆమదాలవలస మండలం

వృద్ధాప్యంలో అండగా ..



వృద్ధుడిని కావడంతో ఎక్కడికీ వెళ్లలేను. నాలాంటి వారికి గ్రామ వలంటీర్ సేవలు వరంలా మారాయి. మా గ్రామ వలంటీర్ సవర సుధీర్ నా కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నాడు. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నాడు. నాకు అనారోగ్య కారణంగా ఎప్పటికప్పుడు జిల్లా ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నాను. పలుమార్లు జిల్లా ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందించాడు. కరోనా సమయంలో బంధువులు ఎవరూ మా వద్దకు రావడానికి భయపడేవారు. ఆ సమయంలో వలంటీర్ చేసిన సేవలు మరచిపోలేను.

– సవర వెంకయ్య, మర్రిగూడ గిరిజన గ్రామం, హిరమండలం మండలం

వలంటీర్ వల్లే పింఛన్ వచ్చింది



నేను నర్సింగపల్లిలో నివసిస్తున్నాను. 60 ఏళ్లు నిండాయి. వృద్ధాప్య పింఛన్ కోసం దరఖాస్తు చేయాలని మా గ్రామ వలంటీర్ పీస హేమలరావు ఇంటికి వచ్చి సమాచారం ఇచ్చారు. నా వద్ద నుంచి రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకువెళ్లి సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేశాడు. ఇంటికి వచ్చి వేలి ముద్ర వేయించాడు. ఈ ఏడాది జనవరిలో పింఛన్ వచ్చింది. ఈ మధ్య అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేరితో అక్కడికి వచ్చి పింఛన్ అందజేశాడు. మా వలంటీర్ సేవలు మరిచిపోలేను. ఇటువంటి వారిపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు.

– మొయ్యి త్రినాథరావు, నర్సింగపల్లి, నరసన్నపేట మండలం

కూతురు కంటే ఎక్కువ..



కరోనా సమయంలో బంధువులు కూడా మా ఇంటికి రావటానికి బయపడే సమయంలో మా గ్రామ వలంటీరు సనపల రమాదేవి వచ్చి అమ్మా నేను ఉన్నాను అంటూ ఎంతో ధైర్యం చెప్పేది. నాకు వితంతు పింఛన్‌ను ప్రతీనెలా ఒకటో తేదీన ఇంటికి తెచ్చి ఇస్తుంది. మా వలంటీర్ కన్న కూతురు కంటే ఎక్కువగా చూసుకుంటుంది.

– అన్నెపు సావిత్రి, ఊడికలపాడు, దరివాడ పంచాయతీ, జలుమూరు మండలం

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: భవిష్యత్తులో రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచే శక్తి ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని మెట్టెక్కివలస 11వ వార్డు గొల్లవీధి, సుగర్ ఫ్యాక్టరీ వెనుక క్వార్టర్స్, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాన్ని సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు



ఆక్రమణకు గురైన కాలువను సర్వే చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: మండలంలోని బొరిగివలస రెవెన్యూ గ్రామానికి చెందిన ఏటి బట్టిలో ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బగ్గు రమణయ్య, ఎల్లన్నాయుడుతోపాటు పలువురు రైతులు ఇటీవల స్పందనలో ఈ కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఎ.సింహాచలం వెంటనే స్పందించిన రెవెన్యూ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రెవెన్యూ సిబ్బంది కాలువ ప్రాంతాన్ని గురువారం సర్వే చేసి ఆక్రమణలకు గురైన కాలువను గుర్తించారు. 20 ఏళ్లుగా కాల్వ ఆక్రమణలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, తంపర భూముల్లో నీటి ముంపు సమస్య తొలగనుందని రైతులు చెప్పారు. కాలువను శ్రమదానంతో అభివృద్ధి చేసుకోవడానికి సిద్ధవుతున్నట్లు రైతు రమణయ్య తెలిపారు.

వలంటీర్ వ్యవస్థపై పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న సురేష్, రామకృష్ణ

హిరమండలం: వలంటీర్ వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని హిరమండలం పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రతి గడపకీ సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ల వ్యవస్థ వల్లనేనన్నారు. వలంటీర్లను చూసి పవన్ వణికిపోతున్నారన్నారు. ప్రజలకు వలంటీర్ల ద్వారా జగనన్న మంచిచేయడాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. కరోనా సమయంలో ప్రజలకు నిత్యావసర సరుకులు, శానిటైజర్లు, మాస్కులు తదితర సేవలందించిన వలంటీర్లను కించపరచటం సరికాదన్నారు.

నీలమణిదుర్గ అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఇలవెల్పు పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం సారె సమర్పించారు. గురువారం ఉదయం అమ్మవారి ఆలయంలో ఉన్న అద్దాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులు, మహిళలతో కలిసి ఎమ్మెల్యే సారే పట్టుకుని అమ్మవారి ఆలయం చుట్టు ప్రదర్శనలు చేసి సారె సమర్పించారు. అనంతరం మహిళలకు చీర, గాజులు, స్వీట్లు, ప్రసాదం అందజేశారు. రేగిడి జెడ్పీటీసీ పాలవలస ఇందుమతి, పాలకొండ జెడ్పీటీసీ గౌరీపార్వతి, అలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

హిరమండలం: మండలంలోని 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ కె.రాంబాబు గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.హసిని, పి.ఢిల్లేశ్వరరావు, బి.తేజేశ్వరరావు, పి.శ్రీహర్షిణి, కె.తేజేశ్వరరావు ఎంపికయ్యారన్నారు. తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.పూజిత, ఎం.జ్యోత్స్న, ఆర్.దేవీశంకర్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నుంచి బి.వనిత, బి.శైలజ, అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పి.శ్రీజ ఎంపికయ్యారన్నారు.

చాపర జిల్లా పరిషత్ పాఠశాల నుంచి..

మెళియాపుట్టి: మండలంలోని చాపర జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివిన సాప కేశవర్ధిని (పదిలో 563 మార్కులు–పట్టుపురం గ్రామం) ట్రిపుల్ ఐటీలో ప్రతిభ చాటింది. బీసీ కోటాలో అర్హత సాధించింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నరసన్నపేట మండలం నుంచి 12 మంది..

నరసన్నపేట: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మంచి మార్కులు పొందిన 12 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ (బోర్డు) ఉన్నత పాఠశాల నుంచి బి.లలిత, టి.విశాల్, ఎస్.ప్రతిమ, బి.దర్శిణి, ఎం.గౌతమ్, జి.జశ్వంత్ ఎంపికయ్యారన్నారు. ఉర్లాం జెడ్పీహెచ్ స్కూల్ నుంచి బట్న సుధాకర్, ఎన్ని హారిక, సెంచుల జ్యోతి, సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మడిపల్లి యాదగిరి, కంబకాయ ఉన్నత పాఠశాల నుంచి శిమ్మ రాఘవ, కింజరాపు చైతన్య లక్ష్మి ఎంపికైన వారిలో ఉన్నారు.

కొత్తూరు మండలం నుంచి ఏడుగురు..

కొత్తూరు: మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. నివగాం జెడ్పీ ఉనత పాఠశాల నుంచి ఉత్తరకవాటం తనూజ చౌదరి, మెట్టూరు జెడ్పీహెచ్ఎస్ నుంచి లోతుగెడ్డ తిరుమల, పెదకోట దిలీప్, కురుమోజి ధరణి ఎంపికయ్యారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి హర్షిత, మహేష్, ఖగేశ్వరరావు, మెట్టూరు సర్పంచ్ పెదకోట సాదుబాబు అభినందనలు తెలిపారు.

15న స్పాట్ అడ్మిషన్లు

పాతపట్నం: పాతపట్నం బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో 25 మిగులు సీట్లుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 9 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణతార గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాతపట్నం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీరాములు



పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.శ్రీరాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కె.సూర్యచంద్రరావు శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలకు బదిలీపై వెళ్లారు. కె.శ్రీరాములుకు అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అధిక ఫీజులు నియంత్రించాలి

జలుమూరు: కార్పొరేట్ కాలేజీలతోపాటు పాఠశాలలో వసూళ్లు చేస్తున్న అధిక ఫీజులు నియంత్రించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏఐవైఎఫ్ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. యూనిఫాం, పుస్తకాలు పాఠశాలలోనే కొనుగోలు చేయాలని ఆయా యాజమాన్యాలు తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. వీటిపై జిల్లా కలెక్టర్‌తోపాటు డీఈఓ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్.సాంబశివరాజు తదితరులు పాల్గొన్నారు.

38 మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు: మండలంలోని కలిగాం కూడలి వద్ద గురువారం సెబ్ స్టేషన్ ఎస్ఐ ప్రభాకరరావు వాహన తనిఖీలు నిర్వహించారు. కలిగాం గ్రామానికి చెందిన ఆశపు కేశవరావు వద్ద 38 మద్యం సీసాలు పట్టుపడినట్లు ఎస్ఐ తెలిపారు. బైక్, మద్యం సీసాలను సీజ్ చేశామన్నారు. కేశవరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు



సారవకోట: బుడితిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

గ్రామాల్లో యజ్ఞంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. గురువారం పలువురి ఇళ్ల వద్దకే వెళ్లి, జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువపత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్జ: ఓ.వి.పేలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: తీమరలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: బాణాపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జలుమూరు: సుబ్రహ్మణ్యపురంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



సరుబుజ్జిలి: విజయరాంపురంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శ తమ్మినేని చిరంజీవినాగ్



హిరమండలం: రుగడలో మహిళలతో కలిసి జగనన్న సురక్ష కార్డులను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: కొరపాంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు



సారవకోట: గుమ్మపాడులో ధ్రువపత్రాలు అందస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి

ఎల్.ఎన్.పేట: అర్హత కలిగిన వారికి కొత్తగా ఓటు హక్కు కల్పించటం, ఓటర్ల జాబితాల్లో తప్పు, ఒప్పులను సరిచేయటం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని బీఎల్ఓలకు స్థానిక తహసీల్దార్ ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం బీఎల్ఓలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

2024 జనవరి నాటికి 18 ఏళ్ల వయస్సు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు.

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను చదివి వారి ఇంట్లో ఉన్న ఓటర్ల వివరాలను సరిచూసుకోవాలని, ఓటుకు ఆధార్ కార్డు నంబర్ అనుసంధానం చేయాలన్నారు. వీఆర్వోలు, బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



సరుబుజ్జిలి: మండలంలోని వ్యాసులుపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో తాగునీటి కుళాయిలు పనిచేయక ఫ్లోరైడ్ నీటిని ప్రజలు తాగేవారు. దీంతో సాక్షి పత్రికలో ఈ విషయంపై వచ్చిన కథనాలకు విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తక్షణమే తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు ప్రకటించారు.